క్లుప్తంగా

అనాథలకు పండ్లు పంపిణీ



పిల్లలకు పండ్లు, బ్రెడ్లు అందజేస్తున్న ఎమ్మెల్యే జరదొడ్డి సుధాకర్

కర్నూలు కల్చరల్: విశాఖ శారదా పీఠాధిపతి శ్రీ స్వరూపానందేంద్ర స్వామి జన్మదినాన్ని పురస్కరించుకుని శుక్రవారం కోడుమూరు ఎమ్మెల్యే సుధాకర్ పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. కర్నూలు మండల పరిధిలోని పసుపుల, బి.తాండ్రపాడు గ్రామాల్లోని అనాథ ఆశ్రమాల్లో పిల్లలకు పండ్లు, బ్రెడ్ ప్యాకెట్లు అందజేశారు. పసుపుల గ్రామంలోని అక్షిత భవాని ట్రస్ట్ బ్లైండ్, బి. తాండ్రపాడు గ్రామంలోని హోమ్ ఆఫ్ హోప్ ఆశ్రమాల్లోని అనాథలు, చెవిటి, మూగ, అంధ పిల్లలతో ఎమ్మెల్యే ముచ్చటించారు.

జీపీఆర్ దంత వైద్య కళాశాలలో సదస్సు

కర్నూలు(హాస్పిటల్): నగర శివారులోని జి. పుల్లారెడ్డి దంత వైద్యకళాశాలలో శుక్రవారం జూనియర్ డాక్టర్లకు వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా పీడియాట్రిక్ దంత వైద్యవిభాగాన్ని ప్రారంభించారు. అనంతరం హెచ్ఓడీ డాక్టర్ వి. సందీప్‌కుమార్ మాట్లాడుతూ ఇందులో పిల్లలు ఆహ్లాదంగా వారి దంత చికిత్సను చేయించుకునే వీలుంటుందన్నారు. కర్నూలు, పరిసర ప్రాంతాల ప్రజలు ఈ సౌకర్యాన్ని ఉపయోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ వై. మురళీధర్‌రెడ్డి, డాక్టర్ కుమార్ పాల్గొన్నారు.

20 నుంచి ఫిట్ ఇండియా వారోత్సవాలు

కర్నూలు కల్చరల్: ఫిట్ ఇండియా వారోత్సవాలను ఈనెల 20వ తేదీ నుంచి జిల్లాలోని అన్ని పాఠశాలల్లో నిర్వహించాలని జిల్లా విద్యాశాఖాధికారి రంగారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థుల్లో శారీరక దృఢత్వం, శ్రేయస్సు, ఆరోగ్యకరమైన జీవన శైలిని ప్రోత్సహించడానికి కేంద్ర ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని చేపడుతుందన్నారు. 20వ తేదీన స్పోర్ట్స్‌డే, 21న క్విజ్, వ్యాసరచన, పోస్టర్ తయారీ పోటీలు, 22న స్వదేశీ ఆటలు, 23న మొబైల్ ఫిట్నెస్ అసెస్మెంట్, 24న యోగా, ధ్యానం, 25న పేరెంట్స్, టీచర్స్, విద్యార్థుల సమావేశం, ఫిట్నెస్ ప్రతిజ్ఞ కార్యక్రమాలు నిర్వహించాలని పేర్కొన్నారు.

నేడు ఝాన్సీ లక్ష్మీబాయి జయంతి వేడుకలు

కర్నూలు కల్చరల్: ఝాన్సీ లక్ష్మీ బాయి జయంతిని శనివారం వీహెచ్‌పీ దుర్గా వాహిని మాతృ శక్తి ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు ఆ సంస్థ జిల్లా కన్వీనర్ జంపాల రాధిక శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటలకు వినాయక్ ఘాట్‌లోని సత్యనారాయణ స్వామి ఆలయం నుంచి ఓల్డ్‌సిటీలోని వాసవీ కళాశాల వరకు మహిళలతో ద్విచక్ర వాహన ర్యాలీ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. అనంతరం కళాశాలలో ఝాన్సీ లక్ష్మీ బాయి జయంతి వేడుకలు జరుగుతాయని, మహిళలు అందరూ పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.

అకౌంట్స్ ఆఫీసర్ డిప్యుటేషన్ పొడిగింపు

కర్నూలు (టౌన్) : నగరపాలక సంస్థ కార్యాలయంలో అకౌంట్స్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న చుండీ ప్రసాద్ డిప్యుటేషన్‌ను ప్రభుత్వం మరో ఏడాది పాటు పొడిగించింది. మూడు సంవత్సరాల క్రితం జిల్లా ఖజానా కార్యాలయం నుంచి ఆయన నగరపాలకకు వచ్చారు. మూడేళ్ల గడువు ముగియడంతో మరో ఏడాది పాటు డిప్యుటేషన్‌ను పొడిగిస్తూ ప్రభుత్వ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి షంషేర్ సింగ్ రావత్ శుక్రవారం సాయంత్రం జీవో 242ను జారీ చేశారు.

27,28 తేదీల్లో విజయవాడలో మహాధర్నా

కర్నూలు(సెంట్రల్): విజయవాడలో నవంబర్ 27, 28 తేదీల్లో జరిగే మహాధర్నాను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎండీ అంజిబాబు కోరారు. శుక్రవారం కార్మిక, కర్షక భవన్‌లో యూనియన్ జిల్లా కార్యవర్గ సమావేశం జరిగింది. కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్షుడు పీఎస్ రాధాకృష్ణ, నాయకులు పాల్గొన్నారు.

శోభాయమానంగా జ్వాలా తోరణం



జ్వాలా తోరణంలో భక్త జన సందోహం

కర్నూలు కల్చరల్: కార్తీక మాసాన్ని పురస్కరించుకుని ఓల్డ్ సిటీలోని లలితా పీఠంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కమనీయంగా లలితా సుందరేశ్వర స్వామి వార్ల కల్యాణం జరిగింది. స్వామి వార్లను పల్లకీలో ఊరేగించారు. జ్వాలా తోరణాన్ని శోభాయమానంగా నిర్వహించారు. టీటీడీ హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో నాగమల్లీశ్వరి బృందం ఆలపించిన అన్నమాచార్య సంకీర్తనలు ఆధ్యాత్మిక భావన కలిగించాయి. లలితా పీఠం అధిపతి మేడా సుబ్రహ్మణ్య స్వామి సందేశమిచ్చారు. పీఠం సభ్యులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

జగనన్నను మళ్లీ సీఎం చేసుకుందాం

- అవినీతికి తావులేకుండా రాష్ట్రంలో పాలన
- లీగల్ సెల్ ఆత్మీయ సమావేశంలో ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్





లీగల్ సెల్ ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే హాఫీజ్ ఖాన్, గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో స్థానికులతో ముచ్చటిస్తున్న ఎమ్మెల్యే

కర్నూలు (లీగల్) : అన్ని వర్గాల ప్రజల సంక్షేమానికి కృషి చేస్తున్న వైఎస్ జగన్‌ను మరోసారి ముఖ్యమంత్రిగా గెలిపించుకుందామని కర్నూలు ఎమ్మెల్యే హాఫీజ్ ఖాన్ అన్నారు. శుక్రవారం రాత్రి స్థానిక చాంబర్ ఆఫ్ కామర్స్‌లో కర్నూలు సిటీ లీగల్ సెల్ ఆత్మీయ సమావేశం జరిగింది. వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ జోనల్ ఇన్‌చార్జి ఎం.ప్రభాకర్, జిల్లా అధ్యక్షుడు పి.సువర్ణారెడ్డి, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి షాషావలి, రాజేష్ తదితరులు పాల్గొన్న ఈ సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి సీఎం వైఎస్ జగన్ అవినీతికి తావ్వులేకుండా పేదల అభివృద్ధే లక్ష్యంగా పాలన సాగిస్తున్నారని చెప్పారు. ఇప్పటికే 2.30 లక్షల కోట్లు పేదల ఖాతాల్లో నేరుగా జమ చేశారన్నారు. విద్య, వైద్యానికి ఎనలేని ప్రాధాన్యత ఇచ్చారన్నారు. పేదలకు ఆరోగ్య శ్రీ ద్వారా కార్పొరేట్ స్థాయి వైద్యాన్ని ఉచితంగా అందజేస్తున్నారన్నారు. సీఎం చేస్తున్న మేలును చూసి ఓర్వలేక ప్రతిపక్షాలు అసత్య ప్రచారం చేస్తున్నాయని, దానిని తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. గతంలో ఎవ్వరూ చేయని విధంగా కర్నూలు అభివృద్ధికి కృషి చేయడంతో పాటు అవసరమైన తోడ్పాటు అందిస్తున్నారన్నారు. వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ జోనల్ ఇన్‌చార్జ్ ఎం.ప్రభాకర్ మాట్లాడుతూ న్యాయ రాజధాని కోసం జగన్ చేస్తున్న ప్రయత్నాలను ప్రతిపక్షాలు కోర్టులకు వెళ్లి అడ్డుకున్నా ఈ ప్రాంత అభివృద్ధి కోసం ఇప్పటికే లోకాయుక్త, మానవహక్కుల కమిషన్, నేషనల్ లా యూనివర్సిటీ, ఇతర ట్రిబ్యునల్స్‌ను ఏర్పాటు చేశారన్నారు. న్యాయవాదులు రానున్న ఎన్నికల్లో ప్రతిపక్షాల ఆరోపణలను తిప్పికొట్టి వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల గెలుపునకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. జిల్లా అధ్యక్షుడు సువర్ణారెడ్డి మాట్లాడుతూ జూనియర్ న్యాయవాదులకు మూడేళ్ల పాటు నెలకు రూ.5 వేలు ఇచ్చి వృత్తిలో నిలదొక్కుకునేలా 'లా' నేస్తం పథకాన్ని అమలు చేస్తున్నారన్నారు. న్యాయవాదుల సంక్షేమం కోసం వంద కోట్ల రూపాయల నిధులు మంజూరు చేసిన ఘనత సీఎం జగన్‌దే అన్నారు. న్యాయ విభాగంలో పనిచేసే న్యాయవాదులందరికీ రానున్న రోజుల్లో మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. లీగల్ సెల్ సిటీ అధ్యక్షుడు రాజేష్ మాట్లాడుతూ కర్నూలులో మళ్లీ వైఎస్‌ఆర్‌సీపీ అభ్యర్థి గెలుపునకు సమష్టిగా కృషి చేద్దామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర జాయింట్ సెక్రటరీ షాషావలి, ఇతర న్యాయవాదులు మాట్లాడుతూ పేదల సంక్షేమానికి సీఎం జగన్ చేస్తున్న కృషిని ఓటర్లకు వివరించి వారు వైఎస్‌ఆర్‌సీపీకి అండగా నిలబడేలా కృషి చేద్దామన్నారు. సమావేశం అనంతరం న్యాయవాదులు ఎమ్మెల్యే హాఫీజ్ ఖాన్‌ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పెద్ద ఎత్తున న్యాయవాదులు పాల్గొన్నారు.

ఇంటి వద్దకే పథకాలు

కర్నూలు (రాజ్‌విహార్) : రాష్ట్ర ప్రభుత్వం సచివాలయ వ్యవస్థ ద్వారా అర్హుల ఇంటి వద్దకే సంక్షేమ పథకాలను తీసుకొచ్చి ఇస్తుందని ఎమ్మెల్యే హాఫీజ్ ఖాన్ అన్నారు. శుక్రవారం రాత్రి ఆయన 48వ వార్డు రోజా వీధిలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానికులకు ప్రభుత్వ పథకాల ద్వారా చేకూరిన లబ్ధిని వివరించారు. రాష్ట్రంలో సంక్షేమ పాలన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమైందని, రాబోయే రోజుల్లో మరింత మంచి చేయనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ మల్లికా బేగం, పార్టీ నాయకులు మద్దయ్య, ఖలీద్, దాదా బాషా, సఫియా ఖాతున్, ప్రసాద్, న్యాయవాదుల విభాగం నాయకులు ప్రభాకర్, సువర్ణారెడ్డి, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వం చేసిన మేలును వివరించండి

కర్నూలు(రాజ్‌విహార్): ప్రభుత్వం పేదలకు చేసిన మేలును ఇంటింటికి వెళ్లి వివరించాలని ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్ వైఎస్‌ఆర్‌సీపీ నాయకులకు పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక బి. క్యాంప్‌లో 15, 22, 42వ వార్డుల కార్పొరేటర్లు ముఖ్య నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ఏ సీఎం చేయని మంచిని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేస్తున్నారన్నారు. సచివాలయ, వలంటీరు వ్యవస్థ ద్వారా అర్హుల ఇంటి వద్దకే సంక్షేమ పథకాలను తీసుకెళ్లి ఇస్తున్నారన్నారు. దీనిని జీర్ణించుకోలేక టీడీపీ నేతలు కుట్రలు పన్నుతున్నారని వాటిని తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. సమావేశంలో కార్పొరేటర్ అలియా, నాయకులు కాశిరెడ్డి శ్వేత, ఆదిమోహన్‌రెడ్డి, మోయిన్, ఎజాజ్, కేదార్, కరుణాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

స్వయం ఉపాధి కల్పనకు చర్యలు

కర్నూలు(రాజ్‌విహార్): రాష్ట్ర ప్రభుత్వం యువతకు స్వయం ఉపాధి అవకాశాలు కల్పించేందుకు చర్యలు చేపట్టిందని కర్నూలు ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్ అన్నారు. శుక్రవారం స్థానిక జోహరాపురంలోని రయ్యాన్ మసీదులో వక్ఫ్‌బోర్డు సహకారంతో ఏర్పాటు చేసిన ఉచిత కుట్టు మిషన్ల శిక్షణ కేంద్రాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో హజ్ కమిటీ డైరెక్టర్ హాఫీజ్ మంజూర్, నాయకులు అక్బర్ అలీ, చందు, సూర్య మోహన్, మసీదు పెద్దలు పాల్గొన్నారు.

పుట్టుకతో లోపాలున్న పిల్లలకు ప్రత్యేక చికిత్స



ప్రత్యేక అవసరాలు గల చిన్నారులతో జిల్లా కో ఆర్డినేటర్ హేమలత

కర్నూలు(హాస్పిటల్): పుట్టుకతో లోపాలున్న పిల్లలకు జిల్లా సత్వర చికిత్స కేంద్రం(డైస్)లో ప్రత్యేక చికిత్స అందిస్తున్నట్లు రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమం జిల్లా కో ఆర్డినేటర్ హేమలత అన్నారు. శుక్రవారం కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని డైస్ కేంద్రంలో బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు ఆటల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష మెగా ఆరోగ్య శిబిరాల్లో వివిధ ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న పుట్టుకతో లోపాలు గల శిశువు పెరుగుదల, అభివృద్ధిలో ఆలస్యం గల వారికి, ప్రమాదకర లక్షణాలున్న శిశువులను గుర్తించి డైస్‌కు రెఫర్ చేశారన్నారు. ఇక్కడ వారికి ప్రత్యేక వైద్యనిపుణులతో చికిత్సలు అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డైస్ వైద్యాధికారిణి డాక్టర్ సృజన, మేనేజర్ ఇర్ఫాన్, కేర్ ఇండియా కో ఆర్డినేటర్ రేష్మ, ప్రాజెక్టనిస్టు ఖలీల్ పాల్గొన్నారు.

రాజకీయ ప్రాధాన్యతతోనే గిరిజనుల అభివృద్ధి



సమావేశంలో మాట్లాడుతున్న కైలాస్‌నాయక్

కర్నూలు(అర్బన్): రాజకీయ ప్రాధాన్యతతోనే గిరిజనుల అభివృద్ధి సాధ్యమవుతుందని లంబాడీ హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ కైలాస్ నాయక్ అన్నారు. శుక్రవారం స్థానిక కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు ఖేతావత్ లక్ష్మణ్‌నాయక్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మేమెంతమందిమో మాకు అంత వాటా కావాలనే నినాదంతో ముందుకు వెళ్తున్నట్లు చెప్పారు. అన్ని రాజకీయ పార్టీలు మైదాన ప్రాంతాల్లోని గిరిజనులకు రెండు పార్లమెంట్, నాలుగు అసెంబ్లీ స్థానాలను కేటాయించాలన్నారు. ఉమ్మడి జిల్లాలో సంఘాన్ని బలోపేతం చేసే ప్రక్రియలో భాగంగా నంద్యాల జిల్లాకు కన్వీనర్లుగా రూఢావత్ రమేష్ నాయక్, దేవావత్ రవినాయక్, రత్నావత్ నాగరాజునాయక్, సోమునాయక్, శ్యామానాయక్, చరన్‌నాయక్, మల్లికార్జుననాయక్‌కు బాధ్యతలు అప్పగించామన్నారు.

స్పోర్ట్స్



బాలుర విభాగంలో ట్రోఫీ అందుకుంటున్న జిల్లా హ్యాండ్‌బాల్ జట్టు

విజేతలకు ట్రోఫీలు, పతకాలు ప్రదానం

67 వ రాష్ట్ర స్థాయి స్కూల్‌గేమ్స్ హ్యాండ్ బాల్ అండర్-19 విజేతలకు రాష్ట్ర స్కూల్‌గేమ్స్ హ్యాండ్ బాల్ పోటీల పరిశీలకులు విజయ్‌కుమార్, రాష్ట్ర రగ్బీ సంఘం కార్యదర్శి రామాంజనేయులు, జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి జోసఫ్ లక్ష్మయ్య, పీఈటీల సంఘం కార్యదర్శి వెంకటేశ్వర్లు అడ్వైజర్ విజయ్‌కుమార్ ట్రోఫీలు, పతకాలు బహూకరించారు. కార్యక్రమంలో ఫిజికల్ డైరెక్టర్లు చంద్రశేఖర్, పద్మలత, శేఖర్, ఎండీ బాషా తదితరులు పాల్గొన్నారు.

క్రీడా నైపుణ్యాలు మెరుగుపరుచుకోవాలి

కర్నూలు (టౌన్) : విద్యార్థులు తమలోని క్రీడా నైపుణ్యాలను మెరుగు పరచుకోవాలని 26 వ వార్డు కార్పొరేటర్ దండు లక్ష్మీకాంతరెడ్డి, జిల్లా ఒలింపిక్ సంఘం కార్యదర్శి శ్రీనివాసులు అన్నారు. శుక్రవారం స్థానిక స్పోర్ట్స్ అథారిటీ ఔట్‌డోర్ స్టేడియంలో జిల్లా షూటింగ్ బాల్ సంఘం ఆధ్వర్యంలో జిల్లా స్థాయి అండర్-17, అండర్-19 విభాగంలో బాల బాలికలకు ఎంపిక పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లా షూటింగ్ బాల్ అసోసియేషన్ కార్యదర్శి ఈశ్వర్‌నాయుడు, ఫిజికల్ డైరెక్టర్లు ఫాతిమాబీ, మనోహర్, జ్యోతి, నాగేశ్వరి, మాధవిలత పాల్గొన్నారు.

హ్యాండ్‌బాల్ విజేతలు కర్నూలు, పశ్చిమగోదావరి జట్లు

కర్నూలు (టౌన్) : రాష్ట్ర స్థాయి స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ అండర్-19 హ్యాండ్‌బాల్ ఫైనల్ పోటీల్లో బాలుర విభాగంలో కర్నూలు, బాలికల విభాగంలో పశ్చిమ గోదావరి జిల్లాల జట్లు విజతగా నిలిచాయి. నగరంలోని బి.క్యాంపు క్రీడా మైదానంలో నిర్వహించిన ఈ పోటీలు శుక్రవారం సాయంత్రం ముగిశాయి. బాలుర విభాగంలో విజయనగరం జట్టుపై 22-15 గోల్స్ ఆధిక్యతతో గెలవగా బాలికల విభాగంలో పశ్చిమగోదావరి జిల్లా జట్టు ప్రకాశం జట్టుపై 7-01 గోల్స్ ఆధిక్యతతో విజయం సాధించింది. ఇదిలా ఉంటే బాలుర విభాగంలో రెండో స్థానంలో విజయనగరం, మూడోస్థానంలో నెల్లూరు జట్టు, నాలుగో స్థానంలో కృష్ణా జిల్లా జట్టు నిలిచింది. బాలికల విభాగంలో రెండోస్థానంలో ప్రకాశం జట్టు, మూడోస్థానంలో గుంటూరు జట్టు, నాలుగో స్థానంలో చిత్తూరు జట్టు నిలిచింది.

రేపు జిల్లా స్థాయి ఈత ఎంపిక పోటీలు

కర్నూలు (టౌన్) : ఈనెల 19 వ తేదీ ఉదయం 10 గంటలకు స్థానిక కిసాన్‌ఘాట్ వద్ద ఉన్న ఈత కోలనులో జిల్లా స్థాయి ఈత ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా ఈత సంఘం కార్యదర్శి నరసింహయ్య ఆచారి శుక్రవారం ప్రకటనలో తెలిపారు. వివరాలకు సెల్: 99661 90117 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

పోలీసు డైరీ

రోడ్డు ప్రమాదంలో భార్యాభర్తలకు గాయాలు

కర్నూలు : కర్నూలు-డోన్ 44వ నెంబర్ జాతీయ రహదారిపై రిజిస్ట్రార్ కార్యాలయం ఎదురుగా జరిగిన రోడ్డు ప్రమాదంలో ఎండోమెంట్ కాలనీకి చెందిన ఇస్మాయిల్, హుసేన్‌బీ తీవ్ర గాయాలకు గురయ్యారు. శరీన్ నగర్‌లో ఉంటున్న కూతురు దగ్గరికి కాలి నడకన వెళ్తూ రోడ్డు దాటుతుండగా డోన్ వైపు నుంచి కర్నూలులోకి బైక్ వేగంగా వస్తూ ఢీకొట్టడంతో భార్యాభర్తలకు తీవ్ర గాయాలయ్యాయి. వారిని వెంటనే ఆసుపత్రికి తరలించి చికిత్స చేయించారు. ఒకరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

బ్రాహ్మణకొట్కూరు ఎస్ఐ బదిలీ

నంద్యాల జిల్లా బ్రాహ్మణకొట్కూరు పీఎస్‌లో పనిచేస్తున్న ఎస్ఐ హెచ్.ఓబులేసు బదిలీ అయ్యారు. ఈమేరకు గురువారం రాత్రి కర్నూలు రేంజ్ డీఐజీ సెంథిల్ కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. ఆయనను ఆలూరు పీఎస్‌కి బదిలీ చేస్తూ డీఐజీ ఉత్తర్వులిచ్చారు.

కవులు, కళాకారులకు సన్మానం



సన్మాన గ్రహీతలతో గ్రంథాలయ సంస్థ చైర్మన్ సుభాష్ చంద్రబోస్

కర్నూలు కల్చరల్: జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం జిల్లా కేంద్ర గ్రంథాలయ సంస్థలో ప్రముఖ కవులు, కళాకారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులను ఘనంగా సన్మానించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎం. సుభాష్‌చంద్రబోస్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో విద్యార్థులకు వక్తృత్వ పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. ప్రముఖ కవులతో కవి సమ్మేళనం నిర్వహించారు. విశ్రాంత ఇరిగేషన్ ఇంజినీర్ ముచ్చుకోట చంద్రశేఖర్, నిఖిల్ ఎడ్యుకేషన్ అకాడమి సంస్థ అధ్యక్షుడు మద్దులేటి, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గంగాధర్‌రెడ్డి పాల్గొని ప్రసంగించారు. న్యాయ నిర్ణేతలుగా విశ్రాంత ఉపాధ్యాయులు నాగరాజు, గంగిరెడ్డి, గోవిందరావు, మద్దయ్య వ్యవహరించారు. కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ కార్యదర్శి పెద్దక్క, లైబ్రేరియన్లు వజ్రాల గోవిందరెడ్డి, భాష, చంద్రమ్మ, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తం

బీఎల్‌ఓలుగా సచివాలయాల ఉద్యోగులు

కర్నూలు (టౌన్): నియోజకవర్గం 137 పరిధిలో ఏడుగురు సచివాలయాల ఉద్యోగులను బూత్ లెవల్ ఆఫీసర్లుగా నియమించారు. కె. స్వాతి, ఆర్తాజ్ మహమ్మద్, ఆర్. మాస్టర్ ప్రవీన్ కుమార్, ఎం. రంగనాథ్, ఎ. మానస, ఇ. కిరణ్‌కుమార్, జయమ్మలను నియమిస్తూ శుక్రవారం సాయంత్రం నగరపాలక కమిషనర్ భార్గవ్‌తేజ ఉత్తర్వులు జారీ చేశారు. బీఎల్‌ఓలుగా నియమించబడిన వారు కర్నూలు నియోజకవర్గం పరిధిలో ఓటర్ల గుర్తింపు, మార్పులు చేర్పులు, బోగస్ ఓట్లు తదితర వాటి విషయంలో పక్కాగా విచారణ చేయాలని ఆదేశాలు జారీ చేశారు.

ముగ్గురికి ఇన్‌చార్జ్ అడ్మిన్లుగా బాధ్యతలు

కర్నూలు (టౌన్): నగరపాలక పరిధిలోని సచివాలయాల్లో పనిచేసే ముగ్గురికి అడ్మిన్లుగా అదనపు బాధ్యతలు అప్పగించారు. హెచ్.ఎం. రవికుమార్ (గరీబ్‌నగర్), ఎస్. శివక్రిష్ణ (మాధవినగర్), మద్దిలేటి (కె. శ్రీనివాసులు)లను నియమిస్తూ శుక్రవారం నగరపాలక అడిషనల్ కమిషనర్ రామలింగేశ్వర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఆయా స్థానాల్లో పనిచేస్తున్న సచివాలయాల ఉద్యోగులు సెలవుల్లో ఉండటంతో పాలన పరమైన ఇబ్బందులు రాకుండా ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించినట్లు అందులో తెలిపారు.

ఓటు నమోదుపై అవగాహన

కర్నూలు కల్చరల్: జి.పుల్లయ్య రవీంద్ర ఇంజినీరింగ్ కళాశాలలో విద్యార్థులకు ఓటు హక్కు నమోదుపై శుక్రవారం అవగాహన కల్పించారు. పలువురితో ఓటర్ హెల్ప్‌లైన్ యాప్‌లో ఓటు నమోదు చేయించారు. ఎన్నికల నమోదు అధికారి ఆర్‌డీఓ హరిప్రసాద్ మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరు ఓటరుగా పేరు నమోదు చేసుకోవాలన్నారు. ఓటర్ల వివరాల్లో ఏవైనా తప్పులు ఉన్నట్లయితే సరిదిద్దుకోవచ్చని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ శివరాముడు, ఎన్నికల ఉప తహసీల్దార్ ప్రవీణ్, పసుపల, తాండ్రపాడు, గార్గేయపురం గ్రామాల బీఎల్‌వో, వీఆర్‌వోలు పాల్గొన్నారు.

వార్షికోత్సవ పోస్టర్ల ఆవిష్కరణ

కర్నూలు(సెంట్రల్): ఏఐటీయూసీ అనుబంధ హోటల్, బేకరీ వర్కర్స్ యూనియన్ నాలుగో వార్షికోత్సవం నేడు నిర్వహిస్తున్నామని, జయప్రదం చేయాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ఎస్.మునెప్ప కోరారు. శుక్రవారం ఎస్టీయూ భవన్‌లో కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు రామంజనేయులు, పురుషోత్తం, రంగనాయకులు, ఆనంద్, బాష, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

కొనసాగుతున్న నిరసన దీక్ష

కర్నూలు(సెంట్రల్) : డీఎస్పీ యుగంధర్‌బాబు మామ వెంకటేశ్వర్లు రియల్ ఎస్టేట్ వ్యాపారంలో చేస్తున్న ఆగడాలు, అరచాకాలను అరికట్టాలని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ మహిళా ఐక్యవేదిక వ్యవస్థాపక అధ్యక్షురాలు పట్నం రాజేశ్వరి డిమాండ్ చేశారు. కల్లూరుకు చెందిన సుగుణమ్మ, లక్ష్మీల నుంచి రూ. 15 లక్షలు తీసుకొని మోసం చేసిన కమ్మ వెంకటేశ్వర్లుపై చర్యలు తీసుకోవాలని ఆ ఐక్యవేదిక ఆధ్వర్యంలో చేపట్టిన దీక్షలు శుక్రవారంతో మూడో రోజుకు చేరాయి. కాగా ఈ దీక్షకు పలువురు మద్దతు తెలిపారు.

నేటి నుంచి సత్యసాయిబాబా జయంతి వేడుకలు

కర్నూలు కల్చరల్: భగవాన్ పుట్టపర్తి సత్యసాయి బాబా జయంతి వేడుకలను నెహ్రూనగర్‌లోని సత్యసాయి మందిరంలో శనివారం నుంచి నిర్వహిస్తున్నట్లు సత్యసాయి సేవా ట్రస్ట్ జిల్లా అధ్యక్షుడు మాకా అశోక్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 23వ తేదీన బాబా జన్మదినాన్ని పురస్కరించుకొని ఆరు రోజుల పాటు వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. శనివారం సాయంత్రం 5.30 గంటల నుంచి బాలవికాస్ విద్యార్థులతో సాంస్కృతిక కార్యక్రమాలు, భజన, మంగళహారతి కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. సేవా ట్రస్ట్ సభ్యులు, సాయి భక్తులు అందరూ పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.

పెండింగ్ ఫారాలపై దృష్టి సారించండి

కర్నూలు(సెంట్రల్): ఓటరు ముసాయిదా జాబితాకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న ఫారం-6,7,8లను త్వరితగతిన ప్రాసెస్ చేయాలని జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ నుంచి ఆమె వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మండలాధికారులతో వివిధ అభివృద్ధి, సంక్షేమపథకాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సెక్టోరల్ ఆఫీసర్లు పోలింగ్ కేంద్రాల రూట్లను సరిచేసుకోవాలన్నారు. శనివారం నుంచి డీ పట్టాల పంపిణీకి సంబంధించిన కార్యక్రమాలు మండలాల స్థాయిలో చేపట్టాలని, ఆయా కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులు హాజరయ్యేలా చూడాలని ఆదేశించారు. హైబ్రిడ్ జొన్నలు క్వింటాల్‌కు రూ.3,180, మాల్దండి రకం రూ.3,225, కొర్రలను క్వింటాల్‌కు రూ.3,846, రాగులు క్వింటాల్‌కు 3,846 మద్దతు ధర కల్పిస్తామన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో డీఆర్వో మధుసూదన్‌రావు, ఇతర జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

ఉపాధిలో లక్ష్యాన్ని సాధించాలి

- కూలీలకు పని కల్పిస్తామనే భరోసా ఇవ్వాలి
- డిసెంబర్ 15 నాటికి 17 వేల ఇళ్లు పూర్తి కావాలి
- జిల్లా కలెక్టర్ డా.జి. సృజన



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ సృజన

కర్నూలు(అర్బన్): 'జిల్లాలో ఉపాధి హామీ పథకం అమలుకు సంబంధించిన లక్ష్య సాధనలో వెనుకబడి ఉన్నాం ... ఈ నెల 20వ తేది నాటికి వంద శాతం లక్ష్యాన్ని సాధించాలి. లేకపోతే బాధ్యులపై చర్యలు తప్ప'వని జిల్లా కలెక్టర్ డా.జి. సృజన హెచ్చరించారు. శనివారం సాయంత్రం స్థానిక జిల్లా పరిషత్ సమావేశ భవనంలో ఎంపీడీఓ, ఈఓఆర్‌డీ, హౌసింగ్, పీఆర్, కాంట్రాక్టర్లతో ఉపాధి హామీ, హౌసింగ్, ప్రాధాన్యత భవనాలు, ఆడుదాం ఆంధ్ర తదితర అంశాలపై ఆమె సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని 25 లక్షల జనాభాలో 60 వేల మందికి పని కల్పించలేమా? అని ప్రశ్నించారు. వలసలను పూర్తిగా ఆపలేకపోవచ్చు..కొంత మందికైనా పని కల్పించాలి కదా ? అని ఆమె ప్రశ్నించారు. వలసలు వెళ్తున్న మంత్రాలయం, కోసిగి, కౌతాళం మండలాల్లో 60 శాతం పనులు కల్పించడమేమిటని ఎంపీడీఓలను నిలదీశారు. వలసలకు వెళ్లకుండా ఉన్న ఊళ్లోనే పనులు కల్పిస్తామనే భరోసా కూలీలకు కల్పించాలన్నారు. ఎన్‌టీఆర్, గుంటూరు, కోనసీమ వంటి వ్యవసాయం ఉన్న జిల్లాల్లోనే 90 శాతానికి పైగా సాధిస్తుంటే మన జిల్లా మాత్రం 84 శాతం మాత్రమే సాధించారని అసంతృప్తిని వ్యక్తం చేశారు. ఈ నెలాఖరుకు పెండింగ్‌లో ఉన్న చెత్త సంపద తయారీ కేంద్రాలను పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. డిసెంబర్ 15వ తేదీ నాటికి 17 వేల ఇళ్లు పూర్తి కావాలని స్పష్టం చేశారు. ఆప్షన్ 3 కింద ఇళ్ల నిర్మాణాలపై కాంట్రాక్టర్లతో సమీక్షించారు. ఇసుక సమస్య లేకుండా తగిన చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లాలో త్వరలో నిర్వహించనున్న కులగణన కార్యక్రమాన్ని సమర్థవంతంగా చేపట్టాలన్నారు. వలంటీర్, సచివాలయ సిబ్బంది సమన్వయంతో ఇంటింటి సర్వే నిర్వహించాలన్నారు. పభుత్వ ప్రాధాన్యతా భవనాల పనులను వేగవంతం చేసి త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. జగనన్న విద్యా దీవెనకు సంబంధించి తల్లి, విద్యార్థికి జాయింట్ అకౌంట్లు త్వరితగతిన ఓపెన్ చేయించాలన్నారు. ఆడుదాం ఆంధ్ర కార్యక్రమం ప్రతి సచివాలయం పరిధిలో కచ్చితంగా జరగాలన్నారు. సమావేశంలో డ్వామా పీడీ అమర్నాథ్ రెడ్డి, పంచాయతీరాజ్ ఎస్ఈ సుబ్రహ్మణ్యం, జిల్లాపరిషత్ సీఈఓ నాసర రెడ్డి, ఇన్‌చార్జి హౌసింగ్ పీడీ సిద్ధలింగమూర్తి, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ నాగేశ్వరరావు, ఎల్‌డీఎం రామచంద్రరావు, ఎంపీడీఓలు, ఈఓపీఆర్‌డీలు, హౌసింగ్, పంచాయతీరాజ్ శాఖల ఇంజినీర్లు, ఆప్షన్ 3 కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీడీఎం మౌలిక సదుపాయాల పనుల్లో పురోగతి

కర్నూలు(సెంట్రల్): కర్నూలు ట్రిపుల్ ఐటీడీఎంకు సంబంధించి వివిధ మౌలిక సదుపాయాల కల్పన పనులు పురోగతిలో ఉన్నాయని కలెక్టర్ సృజన రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ జవహర్‌రెడ్డికి వివరించారు. శుక్రవారం సీఎస్ ట్రిపుల్ ఐటీడీఎంకు కల్పించే మౌలిక వసతులపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్, ఇతర శాఖల ఉన్నతాధికారులతో సమీక్షించారు. ముందుగా ఆయన వివిధ వసతుల కల్పనకు సంబంధించిన పనులపై కలెక్టర్‌ను ఆరా తీశారు. అందుకు ఆమె సీఎస్‌కు బదులిచ్చారు. రూ.3.72 కోట్లతో ప్రధాన రహదారి నుంచి ట్రిపుల్ ఐటీడీఎం వరకు నిర్మిస్తున్న రహదారిని డిసెంబర్ 15వ తేదీలోపు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. అలాగే రూ.22 కోట్లతో తాగు నీటి వసతిని కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. సంస్థ సమూదాయం మీదుగా వెళ్లే హైటెన్షన్ విద్యుత్ లైన్‌ను రూ.17 కోట్లతో మార్చేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. రూ.12.4 కోట్లతో ప్రహరీని నిర్మించేందుకు ఆర్‌అండ్‌బీ ద్వారా ప్రభుత్వాన్ని ప్రతిపాదించామన్నారు. అప్రోచ్ రోడ్డు వెంట వీధిలైట్ల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. కార్యక్రమంలో ట్రిపుల్ ఐటీడీఎం డైరెక్టర్ సోమయాజులు, కన్సల్టెంట్ విజయానంద్, ఆర్‌అండ్‌బీ ఎస్ఈ నాగరాజు, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ నాగేశ్వరరావు, విద్యుత్ శాఖ ఎస్ఈ రామకృష్ణ, పీఆర్ డీఈ శ్రీనివాసులు పాల్గొన్నారు.

మార్కెట్లోకి నిసాన్ మాగ్నెట్ కారు విడుదల



కర్నూలు (టౌన్): మామిదాల పాడు సమీపంలోని హైటెక్ నిస్సాన్ షోరూంలో శుక్రవారం నిస్సాన్ మాగ్నెట్ ఈజెడ్- షిఫ్టు ఏఎంటీ కారును కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ సి. జగన్నాథరెడ్డి, డైరెక్టర్లు నిరంజన్, హోషిమా రెడ్డి, సి. భారతి ఆవిష్కరించారు. అనంతరం జనరల్ మేనేజర్ ఎస్‌వీఎస్ శాస్త్రీ మాట్లాడుతూ మాగ్నెట్ ఏఎంటీ కారులో అనేక ఆధునిక ఫీచర్లు ఉన్నాయని, దీని ధర రూ.6.49 లక్షలు ఉందన్నారు. కార్యక్రమంలో సేల్స్ మేనేజర్ టి. వికాస్ రెడ్డి పాల్గొన్నారు.

కేవీ చలపతి రావు సేవలు చిరస్మరణీయం

కర్నూలు కల్చరల్: కళా రంగానికి డాక్టర్ కేవీ చలపతి రావు చేసిన సేవలు చిరస్మరణీయమని టీజీవీ కళాక్షేత్రం అధ్యక్ష, కార్యదర్శులు పత్తి ఓబులయ్య, మహమ్మద్ మియ్యా అన్నారు. కేవీ చలపతి సంతాప కార్యక్రమాన్ని శుక్రవారం సీ క్యాంప్ కళాక్షత్రంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రముఖ న్యూరో సర్జన్ డాక్టర్ కేవీ చలపతి రావు సీక్యాంప్‌లో 22 సెంట్లు స్థలాన్ని కొని లలిత కళా సమితికి రిజిస్టర్ చేయించారన్నారు. ఆ తరువాత దాన్ని ఆరుబయట కళా మందిరంగా తీర్చి దిద్దారన్నారు. కార్యక్రమంలో సమితి కోశాధికారి లక్ష్మీకాంతరావు, సభ్యులు సీవీ రెడ్డి, రాజారత్నం, గాండ్ల లక్ష్మయ్య, పాండు రంగయ్య పాల్గొన్నారు.